క్లుప్తంగా

అంధ విద్యార్థులకు అన్నదానం


అంధ విద్యార్థులకు అన్నదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

అమలాపురం టౌన్: సినీ హీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అమలాపురం పట్టణంలోని చిరంజీవి అభిమానులు మంగళవారం స్థానిక లూయి అంధుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, జాతీయ చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ నల్లా నాయుడు, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వర్రే శేషు తదితరులు అంధ విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో దాట్ల బాబు, నిమ్మకాయల రాంబాబు, ఆచంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీఈవో పరిశీలన


గొల్లవిల్లిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డీఈవో కమలాకుమారి

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న సీబీఎస్ఈ ట్యాబ్ బేస్డ్ పరీక్షలను డీఈవో కమలాకుమారి మంగళవారం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. పిల్లలకు మెరుగైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవోలు ఆదినారాయణ, సూర్యనారాయణ, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం ఎల్.రాణి ఉన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం జరగనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక పిలుపునిచ్చింది. మంగళవారం దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు నివాసంలో జిల్లా దళిత నాయకుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు సహకరించి బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జంగా బాబురావు, ఇసుక పట్ల రఘుబాబు, గెద్దం సురేష్ బాబు, కోట రామ్మోహనరావు, గొల్లపల్లి డేవిడ్, బదుగు జేమ్స్ పాల్, నెల్లి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థిక సాయం


మాణిక్యంకు రూ.10 వేల సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కాట్రేనికోన: మండలంలోని గచ్చకాయలపోరలో అనారోగ్యంతో బాధపడుతున్న రచ్చ మాణిక్యంకు ప్రజా చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ట్రస్ట్ సభ్యులంతా మంగళవారం ఆమెను పరామర్శించి సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా యువత అందిస్తున్న సేవలను స్థానికులు అభినందించారు.

ఎంపీకి సత్కారం

అమలాపురం టౌన్: ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా తాను రాసిన ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఎంపీకి శంకర్‌గౌడ్ బహూకరించారు. కార్యక్రమంలో అయినవిల్లి నాగేంద్రకుమార్ గౌడ్, ఐవీ రామకృష్ణ, మార్గాన నాగేంద్ర, కనక లింగేశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు గుర్తించాలి

అల్లవరం: కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టగలిగే పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ, ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, మరుగుదొడ్లు, తుఫాన్ షెల్టర్లు, పాఠశాల ప్రహరీ, పశువుల షెడ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం తదితర పనులు గుర్తించాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఏఈలు సంపత్, స్వామి, ఏపీఓ శ్రీనుబాబు, ఈఓపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తొలగించరు.. ఆధునీకరించరు

- నియోజకవర్గంలో అధ్వానంగా తయారైన డ్రెయిన్లు
- గుర్రపు డెక్క, పూడికలతో ముంపు నీరు దిగక రైతులకు ఇబ్బందులు


గుర్రపు డెక్కతో పూడుకుపోయిన ముమ్మిడివరం వృద్ధ గౌతమి మురుగునీటి డ్రెయిన్


ఆక్రమణలతో పూడుకుపోయిన కొమానపల్లి-గాడిలంక మీడియం డ్రెయిన్

ముమ్మిడివరం: నియోజకవర్గంలోని మురుగునీటి కాలువలు రైతుల పాలిట దుఃఖదాయినిలుగా మారాయి. ఏళ్లుగా కాలువలు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో గుర్రపుడెక్క, నాచు, చెత్తాచెదారంతో పూడుకుపోయాయి. దీనివల్ల ఏటా కాలువల్లో ముంపు నీరు దిగక వేలాది ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. కాలువలను ఆధునీకరించమంటూ ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాలువల ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఎక్కడ చూసినా పూడికలే

ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో రెండు ప్రధాన మురుగునీటి కాలువలు, ఏడు మధ్యతరహా మురుగునీటి కాలువలు, 80 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. ప్రధాన మురుగునీటి కాలువలు 35 కిలోమీటర్లు, మధ్యతరహా మురుగునీటి కాలువలు 57 కిలోమీటర్లు, చిన్న తరహా మురుగు నీటి కాలువలు 280 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో పూర్తిగాను, అమలాపురం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల్లో కొంత భాగం కలిపి మొత్తంగా 40 వేల ఎకరాల వరి పొలాల్లో మురుగునీటిని గోదావరిలోకి మళ్లించేందుకు ఈ డ్రెయిన్‌లు ఉపయోగపడుతున్నాయి. ఇవి కాకుండా 35 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు, 20 వేల ఎకరాల ఆక్వా చెరువుల మురుగునీటిని సైతం బయటకు మళ్లించేందుకు ఈ కాలువలే ఆధారం. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.9 కోట్ల నిధులు మంజూరు చేయడంతో అప్పట్లో డెల్టా ఆధునీకరణలో భాగంగా ప్రధాన మురుగునీటి కాలువలను ఆధునీకరించారు. ఆ తరువాత ఆయా మురుగునీటి కాలువలేవీ ఆధునీకరణకు నోచుకోకపోవడంతో ఎక్కడ చూసినా పూడికలే దర్శనమిస్తున్నాయి.

ఆక్రమణలతో సమస్య జటిలం

అమలాపురం వృద్ధ గౌతమి మురుగునీటి కాలువ, బొండాయి కోడు, ఓల్డు అయినాపురం, మురుగునీటి కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. కొందరు కాలువ గట్లపై పశువుల పాకలు, నివాసగృహాలు నిర్మించుకున్నారు. కొందరు రైతులు కాలువలను ఆక్రమించుకుని కొబ్బరి చెట్లు పెంచుకుంటున్నారు. దీంతో కాలువలు కుచించుకుపోయి అస్తవ్యస్తంగా తయారై పూడుకుపోయాయి. ఈ కారణాల వల్ల ఏటా వేలాది ఎకరాల్లో పంట నీట మునిగి రైతులకు తీవ్ర నష్టాలను మిగులుస్తుంది.

లింకు డ్రెయిన్ ఏర్పాటు చేయాలి



డ్రెయిన్లు అస్తవ్యస్తంగా తయారై ఖరీఫ్‌లో ఏటా పంట చేలు ముంపు బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రధాన డ్రెయిన్లు అయిన అమలాపురం-అయినాపురం, వృద్ధ గౌతమి డ్రెయిన్లు పూడుకుపోయి గుర్రపు డెక్క పేరుకుపోయి ముంపునీరు దిగడంలేదు. డ్రెయిన్ల ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు చేరి ఏటా సుమారు 2 వేల ఎకరాలు ముంపు బారిన పడి పంట నష్టపోతున్నాం. ప్రధాన డ్రెయిన్లను కలుపుతూ లింకు డ్రెయిన్ ఏర్పాటు చేయాలి.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

పొదుపుతోనే స్వయం సహాయక సంఘాల మనుగడ


అమలాపురం 30వ వార్డులో సమావేశమైన స్వయం సహాయక సంఘం సభ్యులు

అమలాపురం టౌన్: మహిళలు చేసే పొదుపుతోనే స్వయం సహాయక సంఘాల మనుగడ ఆధారపడి ఉంటుందని అమలాపురం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి అన్నారు. స్థానిక 30వ వార్డులో బండివారిపేట స్లమ్ సమాఖ్య సభ్యులకు పొదుపుపై వచ్చిన వడ్డీ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాఖ్య ప్రతినిధులకు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రామలక్ష్మి, కౌన్సిలర్ యన్నాబత్తుల పద్మ చెక్కులను అందజేశారు. స్లమ్ సమాఖ్యలో ప్రతి నెలా ప్రతి సభ్యురాలు రూ.20 పొదుపు చేసుకుంటున్నారని సిటీ మేనేజర్ రామలక్ష్మి తెలిపారు. ఇలా వచ్చిన మొత్తాలతో తిరిగి కొందరు సభ్యులు అప్పులు తీసుకుని సంఘాన్ని లాభాల బాటలో నడుపుతున్నారని చెప్పారు. ఇలా పొదుపు వల్ల స్లమ్ సమాఖ్య నుంచి వచ్చిన వడ్డీ రూ.3,17,594, పట్టణ సమాఖ్య నుంచి వచ్చిన రూ.59,595 మొత్తంగా రూ.3,77,189 వడ్డీలకు సంబంధించిన చెక్కులను వార్డు కౌన్సిలర్ పద్మ సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి నాగార్జున, రమణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ కృష్ణవేణి, టౌన్ లెవెల్ ఫెడరేషన్ రిసోర్స్ పర్సన్ పాము శ్యామల తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ


ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముమ్మిడివరం: ముమ్మిడివరం అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డా.యోగితా లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో దోమల రహిత సమాజం, ఆరోగ్యానికి సోపానం అంటూ నినాదాలు చేశారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలు వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, ఫార్మసిస్టు సత్యనారాయణ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల రహిత సమాజమే ఆరోగ్యానికి సోపానం

కాట్రేనికోన: దోమల రహిత సమాజమే ఆరోగ్యానికి సోపానమని కాట్రేనికోన పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎం.శ్రీహరి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా కాట్రేనికోన సిద్ధార్థ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ కొంకి రవి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినపుడే దోమల నిర్మూలన సాధ్యమన్నారు. దోమ కాటుతో చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, మెదడు వాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమలను అరికట్టేందుకు నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు దోమలు నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన వెంకన్న ఆలయ పనులు


వెంకన్న ఆలయ పనులను పరిశీలిస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారి నూతన ఆలయం త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. మంగళవారం ఆలయంలో మూడో వరుస రాతి పనులు ప్రారంభం కావడంతో పనులను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర ఉన్న మీసాల వెంకన్న ఆలయ పునర్నిర్మాణ పనులు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. అనంతరం స్థానిక మదర్‌థెరిస్సా నర్సింగ్ కళాశాలను ఆర్ఏఓ మునిస్వామితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓల్డేజ్‌హోమ్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. ఎస్‌టీపీపీ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని కోరుతూ మంగళవారం పలువురు విద్యార్థులు మల్లాడి కృష్ణారావుకు విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సంబంధిత విద్యాశాఖ అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో అధ్యాపకులను నియమిస్తారంటూ హామీ ఇచ్చారు. అదేవిధంగా డయాలసిస్‌తో బాధపడుతున్న రోగులకు వైద్యసేవలు అందించాలని జిప్‌మెర్ వైద్యులను ఆదేశించారు.

సాగునీరు సరఫరా చేయాలని రైతుల ఆందోళన


గ్రాంటు గ్రామంలో సాగునీరు లేక ఎండిపోయిన వరిచేలో ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లరేవు: శివారు ప్రాంత భూములకు సాగునీటిని పూర్తి స్థాయిలో అందించాలని మంగళవారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో సాగు నీరు అందక ఎండిపోయిన వరి చేలో దిగి ఎండిపోయిన మట్టిబెడ్డలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొలాల్లో 20 రోజుల క్రితం వెదజల్లామని, వర్షాల కారణంగా నీటి సమస్య రాలేదన్నారు. అయితే ప్రస్తుతం కాలువల నుంచి చుక్క నీరు రాక వరి చేలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటిని సరఫరా చేయకుంటే వరినాట్లు పూర్తిగా మాడిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో సాగునీటిని సరఫరా చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు సూరంపూడి శ్రీను, పి.సత్తిబాబు, ఎం.శ్రీను, లోవరాజు, భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో దుమారం

కూలిన చెట్టు, తెగిన విద్యుత్ తీగలు


పెదపల్ల-వెదురుమూడి రోడ్డులో కూలిన చెట్టు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో మంగళవారం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు దుమారం రేగింది. భారీ గానుగ చెట్టు విరిగిపడింది. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలో పాన్‌షాపు పక్కన ఉన్న చెట్టు కూలడంతో, కొత్తూరు నుంచి వెదురుమూడి వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది, ఆ చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో వైర్లన్నీ చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపి, విద్యుత్ తీగలను తొలిగించారు. ఈ ఘటనతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది, సర్పంచ్ ఏడిద సత్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి వి.వేణి హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని, జేసీబీ సాయంతో కూలిన చెట్టును తొలగించారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

స్కూల్ బస్ ప్రమాదంపై విచారణ

మలికిపురం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో ప్రమాదానికి గురైన మలికిపురం భాష్యం స్కూల్ ఉదంతంపై విచారణ నిర్వహించినట్లు ఎంఈఓ-1 ఎం.విజయశ్రీ, ఎంఈఓ-2 వైవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు పాఠశాల వద్దకు వెళ్లి ప్రమాదానికి గురైన బస్‌ను పరిశీలించామన్నారు. ఘటనపై భాష్యం స్కూల్ యాజమాన్యం నుంచి లిఖిత పూర్వక వివరణ కోరినట్లు ఎంఈఓ-2 సత్యనారాయణ తెలిపారు. పాఠశాలల బస్ డ్రైవర్ల తీరుపై త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ విజయశ్రీ తెలిపారు.

జిప్‌మెర్ వైద్యుల కొవ్వొత్తుల ర్యాలీ



యానాంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, మల్లాడి తదితరులు


సీతారామపురంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


ముమ్మిడివరంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

యానాం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ మంగళవారం పట్టణంలో యానాం జిప్‌మెర్ వైద్యులు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సైతం ర్యాలీలో పాల్గొని నిరసనకు సంఘీభావం తెలిపారు. మినీ సివిల్ స్టేషన్ సమీపంలో జీజీహెచ్ నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ విష్ణాలయం వీధి, పిల్లారాయవీధి, సుబ్రహ్మణ్యభారతి వీధి తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ నిందితులను త్వరితగతిన పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ రవిశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, జిప్‌మెర్ ఇన్‌చార్జి ఆనంద్‌రాజ్, వైద్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కళాశాల నుంచి ప్లకార్డులు చేత బట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.తులసిలక్ష్మి, పి.చిట్టిబాబు, డి.విజయ్‌కుమార్, యు.కిరణ్, సుజాత, లీలావతి పాల్గొన్నారు.

విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

తాళ్లరేవు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సోమవారం రాత్రి కోరంగి పంచాయతీ సీతారామపురం నుంచి తాళ్లరేవు దేవీమహల్ వరకూ ర్యాలీ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టి.ఈశ్వరరావు, కమిడి ఈశ్వరీబాయి, దుప్పి అదృష్టదీపుడు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలి

అమలాపురం టౌన్: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని జనసేన పార్టీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నాగమానస డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె హత్యాచార ఘటనను ఖండించారు. కార్యక్రమంలో పదాల శ్రీదేవి, తిక్కా సత్యలక్ష్మి, నల్లా శ్రీధర్, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.

చలామణిలోనే రూ.10 నాణేలు


సాయిని సత్కరిస్తున్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వంశీకృష్ణ తదితరులు

అమలాపురం టౌన్: రిజర్వు బ్యాంక్ ఇండియా(ఆర్‌బీఐ) ఆదేశాల మేరకు రూ.10 నాణేలు చలామణిలో ఉన్నాయని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వంశీకృష్ణ వినియోగదారులకు సూచించారు. స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో మంగళవారం రాత్రి రూ.10 నాణేలు చెల్లుబాటుపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రూ.10 నాణెం మార్కెట్‌లో చెల్లుబాటు కాదన్నది కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. దుకాణ యాజమానులు, వినియోగదారులు ఈ విషయంలో అపోహలు విడనాడాలని సూచించారు. ఈ సందర్భంగా రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతాయంటూ లావాదేవీలు సాగిస్తున్న రవి బుక్ సెంటర్ దుకాణ యాజమాని సాయిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచి చీఫ్ మేనేజర్ బి.రమేష్, ఎస్‌బీఐ ఎల్‌డీఎం అభిషేక వర్మ, బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో మోటారు సైకిల్‌ను నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడుపుతున్న కొందరు యువకులను ఎస్ఐ జ్వాలాసాగర్ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఆరు మోటారు సైకిళ్లపై కొందరు యువకులు అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. అది గుర్తించిన ఎస్ఐ వారిని అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ఇదే పునరావృతమైతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ముమ్మిడివరం: మండలంలోని లంక గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను ముమ్మిడివరం పోలీసులు సీజ్ చేశారు. మండలంలో లంకాఫ్ ఠానేల్లంక పంచాయతీ పరిధిలో గోదావరి నదీ పాయ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాక్టర్‌ను అడ్డుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

అమలాపురం టౌన్/అమలాపురం రూరల్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక నల్ల వంతెన వద్ద గల రాజీవ్ గాంధీ విగ్రహానికి ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బండారులంకలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కొత్తూరి శ్రీనివాస్, అయితాబత్తుల సుభాషిణి, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల్లో జాగ్రత్తలపై అవగాహన


కొత్తలంకలో అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

తాళ్లరేవు: అగ్నిప్రమాదాలు, వరదలు వంటి ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. పిల్లంక పంచాయతీ కొత్తలంక గ్రామంలో ఎన్డీఆర్ఎఫ్ డీఎస్పీ మన్మోహన్‌సింగ్ యాదవ్ బృందంచే ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలంకషంగా వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవితేజ, వీఆర్వో సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అధ్యాపకులకు గంట బోధనకు రూ.150 చొప్పున, నెలకు గరిష్టంగా రూ.10 వేలు చెల్లిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీలోగా తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని కోరారు.

రక్తదాన శిబిరం

రాజోలు: సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం రాజోలు ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సందర్శించి చిరంజీవి అభిమానులను అభినందించారు. కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావు, పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణి, గుండాబత్తుల తాతాజీ, కోళ్ల బాబి, రేకపల్లి శ్రీను పాల్గొన్నారు.